క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం నియోజకవర్గ పరిధిలో గల ఇద్దరికి ఆర్థిక సాయం అందజేశారు. జీవీఎంసీ 36వ వార్డు గొడారిగోతులు (చెంగల్రావుపేట ఏరియా)కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త షేక్ రఫీ కుటుంబానికి ఎమ్మెల్యే తన సొంత నిధుల నుంచి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే పాతనగరం ఫ్రెర్రీరోడ్డుకు చెందిన కదిరి కల్యాణి గత కొంత కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతి మేరకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం చేయించడమే గాక మందుల ఖర్చులకు సొంత నిధుల నుంచి రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు కొల్లి సింహాచలం, కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, మాసిపోగు రాజు, ముజీబీఖాన్, బోని దేవా, కుందేటి సుధాకర్, కడితి రమణమ్మ, కాకి పద్మ తదితరులు పాల్గొన్నారు.

బోట్ల అద్దెలు తగ్గించాలని మంత్రికి వినతి



మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో బోట్లకు పెంచిన నెలవారీ అద్దెలు తగ్గించాలని మరపడవ ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ కోరారు. గురువారం శ్రీకాకుళంలో రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజును కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. బోట్లకు పెంచిన అద్దెను బలవంతంగా వసూలు చేయడానికి మత్స్యశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, రెన్యువల్ చేయొద్దని చెప్పడం తమకు ఇబ్బందిగా మారిందన్నారు. ఆర్థిక సంక్షోభం వల్ల అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న సమయంలో చార్జీలు పెంచడం అన్యాయమన్నారు. రిపేర్ల కోసం సముద్రం నుంచి బయటికి తీసుకొస్తున్న బోట్లకు ల్యాండింగ్ చార్జీలు వసూలు చేయడం దారుణమన్నారు. ప్రస్తుతం ఉన్న చార్జీలను కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని జానకీరామ్ కోరారు.

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం



వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న హియరింగ్ సొల్యూషన్స్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు చేపట్టారు. హియరింగ్ సొల్యూషన్స్, విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో ధ్యాన మందిర ప్రాంగణం వద్ద ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించారు. వినికిడి సమస్యల వైద్యుడు డాక్టర్ రమేష్ అంకిల్లా అవగాహన కల్పించారు. సుమారు 70 మందికి వినికిడి పరీక్షలు చేశారు. అవసరమైన పేదలకు వినికిడి మెషీన్లు అందజేయనున్నట్లు మేనేజర్ సురేష్ తెలిపారు.

అన్నదానం, పల్లకీ సేవ..

ధ్యాన మందిరంలో బాబాకు మధ్యాహ్న హారతి సమర్పించిన అనంతరం భక్తులు, పేదలకు ప్రత్యేక అన్నదానం నిర్వహించారు. సాయంత్రం హారతి అనంతరం పల్లకీ సేవలో మహిళలు పాల్గొని పల్లకీ మోశారు. ఈ కార్యక్రమాల్లో ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు, సాయి సేవకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం

సీఎం జగన్ ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తారని.. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 36వ వార్డులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వెల్లడించారు. ప్రజలకు మేలు చేయడానికి తపిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకుని మరోసారి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే వాసుపల్లి పేర్కొన్నారు.

- అదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం
- జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి
- 35వ వార్డులో 985, 36వ వార్డులో 1277 సర్టిఫికెట్ల పంపిణీ



36వ వార్డులో లబ్ధిదారుకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్ తదితరులు



35వ వార్డులో లబ్ధిదారుకు ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

డాబాగార్డెన్స్ : కులమతాలు.. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే.. అది ఒక్క జగనన్న ప్రభుత్వంలోనేనని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ 36వ వార్డు ఏవీఎన్ కాలేజీ సమీపాన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి ఆ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం కింద వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతి ఇంటిని సందర్శించి 1322 సమస్యలు గుర్తించామన్నారు. అందులో 1277 పనులు పూర్తి చేసి నేడు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందేలా చేస్తున్న ఈ కార్యక్రమంతో ప్రజల్లో జగనన్నపై మరింత నమ్మకం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరిగిందన్నారు. సర్టిఫికెట్ల పరంగా, పథకాల పరంగా సమస్య ఉంటే దాన్ని జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తారని తెలిపారు. దాదాపు 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తారన్నారు. కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ, వివాహం, ఫ్యామిలీ మెంబర్, డెత్, బియ్యం కార్డులు, కుటుంబాల విభజన, సీసీఆర్సీ, మ్యూటేషన్లు, ఫోన్ నంబరుకు ఆధార్ లింకేజీ సర్టిఫికెట్లు ఇలా ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని జగనన్నకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ దక్షిణ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని దేవా, పార్టీ నాయకులు కుందేటి సుధాకర్, కడితి రమణమ్మ, కాకి పద్మ, రమణి, కుంచెయ్య, గౌతమ్, కిషోర్, రాంబాబు, చెన్నా శ్రీధర్, కనకమహాలక్ష్మి, సాగర్, రాజు, రమణ, ఆరుగుల రాజు, ముస్లిం నాయకులు లియాఖత్, హనీష్, రహ్మతుల్లా, పలువురు పార్టీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

35వ వార్డులో 985 సర్టిఫికెట్ల పంపిణీ..

జగదాంబ : రాష్ట్రంలో కేవలం ఇరవై రోజుల వ్యవధిలో 51 లక్షల ధ్రువపత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు అందజేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. గురువారం జీవీఎంసీ 35వ వార్డు సైలాడ కల్యాణ మండపంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమన్నారు. జీవీఎంసీ 35వ వార్డులో అయిదు సచివాలయల్లో కలిపి 1530 సమస్యలు గుర్తించి అందులో 985 పనులు పూర్తి చేశామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ప్రభుత్వ పాలనపై పూర్తిగా నమ్మకం కలిగిందన్నారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే వాసుపల్లి ఛాలెంజ్..

రాష్ట్రంలో కోటీ అరవై లక్షల కుటుంబాలుండగా.. ఇప్పటికే 51 లక్షల కుటుంబాలకు వివిధ సర్టిఫికెట్లు ఇచ్చామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. అలాగే 5.30 కోట్ల మందిని నేరుగా కలిసి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించిన నేత సీఎం జగన్ అని.. ఆయనలా భారతదేశంలో ఎవరైనా ఉన్నారా? చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అలా చేయగలరా? అని తాను ఛాలెంజ్ చేస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. మంచిని మంచిగా చూడండి అని హితవు పలికారు. వలంటీర్లపై తప్పుడు వ్యాఖ్యలు చేసి నీచబుద్ధిని బయటపెట్టుకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే అన్నారు. వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, దుర్గాలమ్మ ఆలయ చైర్మన్ నాయిని మల్లిబాబు, ఆదివిష్ణు, బొగ్గ శ్యామ్, గౌరీశంకర్, మంగరాజు, రమణమ్మ, దుర్గాప్రసాద్, సురేష్, లండా రమణ, బోని దేవా, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గృహసారథులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

సురక్ష కార్యక్రమం కొనసాగించండి..



మా ఇంటికి వచ్చి ఏమైనా సర్టిఫికెట్ల అవసరం ఉందా? అని అడిగి మరీ దరఖాస్తు చేయించారు. నా కుమార్తెకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేస్తే ఉచితంగా ఇచ్చారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిరంతరం కొనసాగించాలని కోరుతున్నాను.

–జ్యోతి, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు.

కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే..



ఒక్క ధ్రువపత్రం కావాలంటే పనులన్నీ మానుకుని కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిందే. అప్పటికీ అనుకున్న పని పూర్తవుతుందో లేదో చెప్పలేం. ఉపాధి కూడా పోయేది. ఇప్పుడు ఇంటి వద్దే కావలసిన ధ్రువపత్రాలు అందిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం బాగుంది.

–కనకమ్మ, పండావీధి, 35వ వార్డు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన

డాబాగార్డెన్స్ : ఆలిండియా బీఎస్ఎన్ఎల్ క్యాజువల్, కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు గురువారం పలు సమస్యలు పరిష్కరించాలంటూ డాబాగార్డెన్స్‌లో గల బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన చేపట్టి డీజీఎంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ క్యాజువల్ సిబ్బందికి బీఎస్ఎన్ఎల్ ద్వారా జీతాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మెడికల్ ఫెసిలిటీ కల్పించాలని, 4జీ వెంటనే ఇవ్వాలని, స్కిల్డ్, సెమీ స్కిల్డ్‌కు ప్రభుత్వం చెప్పే విధంగా జీతాలు ఇవ్వాలని తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లింగమూర్తి, సూర్యప్రకాష్, పీఈసీహెచ్‌వీ సాగర్, సురేష్, సారిపల్లి శ్రీను, ప్రేమ్‌కుమార్, నాగిరెడ్డి, సింహాచలం, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రాజభాష అమలుకు హెచ్‌పీసీఎల్ కృషి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ రతన్‌రాజ్

అల్లిపురం : రాజభాష అమలుకు హెచ్‌పీసీఎల్ కృషి చేస్తోందని కంపెనీ చీఫ్ జనరల్ మేనేజర్ వి. రతన్‌రాజ్ తెలిపారు. విశాఖ రిఫైనరీ ఆధ్వర్యంలో అధికార బాషా వార్షిక సదస్సు 2023 గురువారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో రాజభాషను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్, విశాఖ రిఫైనరీ హెచ్‌ఆర్ జి.కిరణ్ కుమార్, జనరల్ మేనేజర్ లాలన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు భేష్

జగదాంబ : ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ సేవే పరమావధిగా పని చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, పింఛన్లు లబ్ధిదారులకు చేరువ చేసేందుకు నిరంతరం తపిస్తున్నారు. చక్కటి సేవలతో లబ్ధిదారుల మన్ననలు పొందుతున్నారు.

వెదుక్కుంటూ వచ్చి పింఛన్ ఇస్తున్నారు



నేను పూర్ణామార్కెట్ స్ప్రింగ్‌రోడ్డులో కలాసీగా పని చేస్తున్నాను. ప్రతినెలా ఒకటో తేదీన నన్ను వెదుక్కుంటూ వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తుంటారు. గతంలో నెలనెలా పింఛన్ వస్తుందో రాదో తెలియని పరిస్థితి. ఇప్పుడు నెల తిరగ్గానే ఠంచన్‌గా వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తున్నారు. వారి సేవలకు వెలకట్టలేం.

–సత్తిబాబు, కలాసీ, స్ప్రింగ్‌రోడ్డు.



చేతులెత్తి దండం పెట్టాలి..

కరోనా సమయంలో బయటికి రాలేని స్థితిలో కూడా వలంటీర్ నాకు పింఛన్ ఇచ్చారు. బంధువుల ఇంట్లో ఉంటే అక్కడికి.. మా ఇంటికి వస్తే ఇక్కడికి వచ్చి మరీ పెన్షన్ అందజేశారు. వలంటీర్ల సేవలు మరువలేనివి. చేతులెత్తి దండం పెట్టాలి వారికి.

–జానకమ్మ, కల్లుపాకలు, 35వ వార్డు.

మణిపూర్ ఘటనను ఖండించిన ఎల్‌ఐసీ ఉద్యోగినులు

డాబాగార్డెన్స్ : మణిపూర్‌లో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించి, ఆ పిదప మానభంగం చేసినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యమే కారణమంటూ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, ఆ యూనియన్ మహిళా విభాగం సంయుక్తంగా ఖండించాయి. దోషులను చట్ట ప్రకారం శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. మహిళలకు జరిగే అన్యాయాలను ఎన్నో చిత్రాల్లో పలువురు దర్శకులు చూపించారని, ఆ దర్శకుల భయాందోళన నేటికి నిజమవుతుందని.. యూనియన్ ప్రతినిధులు జి. సూర్యప్రభ, జి. వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల కిందట రాజస్థాన్‌లో భార్యాభర్తలను నగ్నంగా ఊరేగించి అవమాన పరచిన ఘటనలో వారు ఆత్మహత్య చేసుకున్న చరిత్ర ఉందని, కుల, మత ప్రాంత విద్వేషాలన్నింటికీ మహిళలను బలి పశువులను చేసే సంస్కృతి ఇంకెప్పుడు తొలగుతుందన్నారు.కేంద్ర ప్రభుత్వం తగు రీతిలో స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రతి వారం అన్నదానం అభినందనీయం



వీవీ రమణమూర్తిని సత్కరిస్తున్న రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు

అల్లిపురం : ప్రతి గురువారం కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుకా యల్లమ్మ అమ్మవారి దేవాలయంలో అన్నదానం చేయడం అభినందనీయమని రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి అన్నారు. గురువారం అమ్మవారి ఆలయంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, పద్మావతి దంపతుల సహకారంతో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు వెంకట అప్పలనాయుడు, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, ఉపాధ్యక్షుడు పంపాన గణేష్, కోశాధికారి వాసుపల్లి నారాయణ, కార్యదర్శి బొడ్డు పోలారావు, బొడ్డేటి ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారికి విశేష పూజలు చేసిన అనంతరం రమణమూర్తిని సత్కరించారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

నేటి నుంచి ఓటరు సర్వే

డాబాగార్డెన్స్ : ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 (నెల రోజుల పాటు) నియోజకవర్గ పరిధిలో ఓటరు సర్వే నిర్వహించనున్నారు. ఇంటింటికీ బీఎల్‌వోలు వచ్చి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కలిగేలా చూడనున్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించనున్నారు. అలాగే ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలుంటే నకిలీ ఓట్లను గుర్తించి తొలగించనున్నారు. చనిపోయిన వారి ఓట్లను తొలగిస్తారు. వందేళ్ల పైబడిన వారిని ముఖ్యంగా గుర్తించనున్నారు. డోరు నెంబరు లేకుండా ఉన్నా, ఒకే డోరు నెంబరుపై పదుల సంఖ్యలో ఉన్న ఓట్లను పరిశీలించనున్నారు. సర్వీసు ఓటర్లు (మిలిటరీ), ఎన్ఆర్ఐ ఓటర్ల వివరాలను సరి చేయనున్నారు. దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లు, వారి అభీష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో అడిగి అక్కడి జాబితాలో ఉంచనున్నారు. ఒక బూత్‌లో సరాసరి 1500 ఓట్లకు మించి ఉంటే కొత్త బూత్‌కు సిఫార్సు చేయనున్నారు. పేర్లు, నియోజకవర్గాలు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, ఫొటో గుర్తింపు కార్డులు, మార్పులు, చేర్పులు, తప్పొప్పులు సరి చేయనున్నారు. ఓటర్ల అభ్యర్థన మేరకు ఒక ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి మార్చడం, గుర్తింపు కార్డులు, జాబితాలోని తప్పుల సవరణ, స్పష్టత లేని ఫొటోలు తొలగించి, మంచి ఫొటోల ఏర్పాటు, అనంతరం జిల్లా ఎన్నికల అధికారికి పంపడం, ఓటు హక్కు పొందని వారుంటే వారికి ఓటు హక్కు పొందే అవకాశం కల్పించనున్నారు. నియోజకవర్గం మారినా, ఓటరు జాబితాలో పేర్లు లేకపోయినా, తప్పులున్నా సరి చేసుకునే అవకాశం ఉంది.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీ హోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

23న కళాభారతిలో శ్రీరామ జననం హరికథ గానం

మద్దిలపాలెం : విశాఖ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమి కళాభారతి ఆహ్వానం మేరకు ఈనెల 23వ తేదీన మద్దిపాలెం కళాభారతి ఆడిటోరియంలో సాయంత్ర 6 గంటలకు కాళ్ల నిర్మలచే శ్రీరామ జననం హరికథా గానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వహకులు వీఎండీఏ కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు పేర్కొన్నారు.

25న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

బీచ్‌రోడ్డు: గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు యూనిఎక్స్‌పర్ట్స్ ప్రతినిధి ఇంతియాజ్ బన్నూరు తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఫార్చ్యూన్ ఇన్ శ్రీకన్యాలో ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించనున్నామన్నారు. ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ యూనివర్సిటీలను ఔత్సాహిక విద్యార్థులను ఒకే తాటిపైకి తీసుకొవచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫెయిర్‌లో అమెరికా, ఆస్ట్రేలియా, యూకే, కెనడా, దుబాయ్, జర్మనీ వంటి 10 దేశాలకు చెందిన యూనివర్సిటీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం https://unixperts.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి



ఆరిలోవ కాలనీ ఆరోగ్య కేంద్రం ల్యాబ్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా మలేరియా అధికారి తులసి

ఆరిలోవ: మలేరియా నివారణపై పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి తెలిపారు. ఆరిలోవ ప్రాంతంలో బాలాజీనగర్, ఆరిలోవ కాలనీలలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆమె గురువారం సందర్శించారు. ఆయా ఆస్పత్రులలో ల్యాబరేటరీలు తనిఖీ చేశారు. లాబరేటరీలలో వినియోగిస్తున్న పరికరాలు, మలేరియా, డెంగ్యూ పరీక్షలలో నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. వాటి నివారణ దిశగా సిబ్బంది పనిచేయాలన్నారు. దీని కోసం ప్రణాళికాబద్ధమైన నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే–ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటికి వెళ్లి లార్వాను గుర్తించాలన్నారు. ప్రస్తుతం ఇంటింటికీ ఫీవర్ సర్వే వేగవంతం చేయాలని సూచించారు. వలంటీర్లకు ఆశా వర్కర్లు సహకరించాలన్నారు. ఈ పర్యటనలో మలేరియా విభాగం అధికారి నగేష్, పలువురు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కేజీహెచ్ వన్‌స్టాప్ సెంటర్ పరిశీలన



ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామారెడ్డితో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

మహారాణిపేట : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ గురువారం కేజీహెచ్‌లో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించి అక్కడున్న పిల్లలతో మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ మానసిక వైద్యశాలని సందర్శించారు. అక్కడి పరిస్థితులను సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎంవీపీలో ఉన్న గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికలతో మాట్లాడారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ(అమరావతి) ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేశారు. అన్ని వసతులు, సౌకర్యాలపై సంబంధిత సిబ్బందితో మాట్లాడి న్యాయసేవల ఉపయోగం కోసం వివరించి, న్యాయసేవలను ఉచితంగా పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛ సర్వేక్షణ్’పై అవగాహన



నరసింహనగర్ రైతుబజార్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై వీధి నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023పై అవగాహన కార్యక్రమాలను జీవీఎంసీ యంత్రాంగం విస్తృతం చేసింది. దీనిలో భాగంగా గురువారం వై.కె.రాజు కళా బృందంచే నరసింహనగర్ రైతుబజార్‌లో ప్రదర్శన నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో నగరానికి మెరుగైన ర్యాంకు సాధనకు విశాఖ పౌరుల పాత్రపై వీధి నాటిక ద్వారా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిషేధం, తడి, పొడి, హానికర చెత్త వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందజేయడం, పరిసరాల పరిశుభ్రత, ఎకో వైజాగ్ వంటి అంశాలపై వీధి నాటిక, జానపద గీతాలతో వినియోగదారులకు, రైతులకు వివరించారు. 51, 49 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ సహాయ వైద్యాధికారి సునీల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులు విడనాడి గుడ్డ సంచులు వాడాలని సూచించారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మురళీమాధవ విద్యాలయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పదో తరగతిలో 500 మార్కులు దాటిన ఆరుగురు విద్యార్థులకు వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు అందించారు. బాలురలో అత్యధిక మార్కులు సాధించిన శేఖర్(553)కు రూ.1,500, ద్వితీయ స్థానం సాధించిన రజని(545)తోపాటు ఇతరులకు వెయ్యి రూపాయల చొప్పున నగదు అందజేశారు. ఈ సందర్భంగా మురళీ మాధవవిద్యాలయం అధినేతలు సనపల మురళీధర్, సత్యవతి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, క్లబ్ కార్యదర్శి ఎస్.పుష్పలత పాల్గొన్నారు.